క్లుప్తంగా

ఘనంగా పూజలు



ప్రత్యేక అలంకారంలో నాగారపమ్మ అమ్మవారు

సుండుపల్లె : మండల పరిధిలోని జికెరాచపల్లి ఉత్తర భాగాన చెరువు దగ్గర వెలసిన శ్రీనాగార పమ్మ ఆలయంలో తిరుణాల ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి సాయంత్రం భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నేడు ఆదివారం ఉదయం మొక్కుబడులో భాగంగా బోనాల కార్యక్రమం ఏర్పాటు చేస్తారని, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ పూజారులు కోరారు.

చిన్నారికి ఆర్థికసాయం

చిట్వేలి : ఏలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి ఆవులకుంట తేజశ్రీకి రైల్వేకోడూరు నియోజకవర్గం వాడియరాజుల సంఘం వారు శనివారం రూ. 76 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని తుమ్మకొండ వడ్డిపల్లికి చెందిన ఆవులకుంట మనోహర్ కుమార్తె 3వ తరగతి చదువుతున్న తేజశ్రీ అనారోగ్య సమస్యతో ఏలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పేద కుటుంబం కావడంతో చిట్వేలి హెల్ప్ లైన్ సొసైటీ, మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు, దాతలు గతంలో రూ.1 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా శనివారం వాడియరాజుల సంఘం సభ్యులు, పెద్దలు రూ.76 వేలును చిన్నారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు కంటి వైద్యశిబిరం

రాయచోటి అర్బన్ : పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్, శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్ పి.యస్.హరినాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పట్టణంలోని కొత్తపేటలో గల బాలికల జూనియర్ హైస్కూల్ ఆవరణలో శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. శిబిరంలో కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని అదేరోజు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. రాయచోటితో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరు గాంధీనగర్ ఎస్టీ కాలనీలో వితంతువులకు రూ. 1000లు చొప్పున శనివారం వితరణగా అందజేశారు. మండలంలోని ఎస్టీ కాలనీలలో భర్తలు చనిపోయి వితంతువులుగా ఉంటూ పెన్షన్ రానివారికి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయుడు ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ. 1000లు చొప్పున ఎస్టీ కాలనీ వితంతువులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, మురళీకృష్ణ, డాక్టర్ రామకృష్ణ, తాటిబోయిన ధనయ్య, మండల టీడీపీ అధ్యక్షులు నారాయణ రెడ్డి, షామీర్ బాష, నాగేంద్ర, శ్రీరామ సుబ్బయ్య, పిచ్చయ్య, రెడ్డయ్య, ఓబిలి బాబు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

రాజంపేట టౌన్ : జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి కాశ్మీర్ కోసం పోరాడిన పోరాట యోధుడని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు పట్టుపోగుల ఆదినారాయణ, రమణ, జీకే.నాగరాజు, డాక్టర్ వేణుప్రసాద్, పీ.పాపయ్య, పీ.రమణ, సుబ్బారావు, తోట నగేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెన్నాతీరం పరిశీలన



ఇసుక రవాణా కోసం జ్యోతి గ్రామంలోని పెన్నానది తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సిద్దవటం : ఇసుక రవాణా కోసం సిద్దవటం మండలంలోని జ్యోతి గ్రామ సమీపంలోని పెన్నానది తీర ప్రాంతాలను శనివారం పరిశీలించామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు జూలై 8వ తేదీ నుంచి ఇసుక రవాణాకు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో జ్యోతి గ్రామ సమీపంలోని పెన్నా నదీ తీర ప్రాంతాలను పరిశీలించామన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఇన్స్‌పెక్టర్ విమల, ఆర్ఐ అనూరాధ, వీఆర్వో శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బడుగువర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



రాజంపేట టౌన్ : బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి, పోలా



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి

రాజంపేట టౌన్: బాబూ జగ్జీవన్‌రామ్ పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో శనివారం బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆకేపాటి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆకేపాటి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ పోరాటపటిమను, పరిపాలన దక్షతను కొనియాడారు. భారతదేశ ఉపప్రధానిగా ఆయన దేశానికి విశేష సేవలందించి నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచారన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ విభాగం నాయకులు దండుగోపి, రామ్మూర్తి, సత్యాల రామకృష్ణ, దాసరి పెంచలయ్యాల, బొజ్జా పెంచలయ్య, జెనుగు కృష్ణారావుయాదవ్, డీలర్ సుబ్బరామిరెడ్డి, మిర్యాల సురేఖ, పాపినేని విశ్వనాథ రెడ్డి, సనిశెట్టి నవీన్‌కుమార్, రఘునాథ్‌రెడ్డి, జేసీబీ శివారెడ్డి, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి

నందలూరు : భారతదేశ తొలి ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. శనివారం నాగిరెడ్డిపల్లి రోడ్లు భవనాల అతిథి గృహం సమీపంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో భీమా మునిస్వామి, షేక్ మౌల తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే రొచ్చు.. రొచ్చు..

పుల్లంపేట : పుల్లంపేట నుంచి చిట్వేలికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ సమీపంలోని రోడ్డు చినుకులకే చిత్తడిగా మారిపోతోంది. ఫలితంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



కొద్దిపాటి వర్షానికి బురదమయమయిన పుల్లంపేట-చిట్వేలి రోడ్డు

శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శనీశ్వరస్వామికి ప్రీతికరమైన ఆషాఢ మాసం శనివారం రోజున ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పూజారి నాగార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పలురకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఆలయం ప్రాంగణం మామిడి తోరణాలు కట్టి స్వామివారికి ప్రీతికరమైన నల్లడి నూగులతో భక్తులు నూనె ఒత్తులు వెలిగించారు. భక్తులకు స్వామిదర్శనం కల్పించి, మంగళహారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

తెరుచుకుంటున్న వైకుంఠ ద్వారం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి దేవాలయంలో వైకుంఠ ద్వారం రోజు తెరుస్తుండటంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వైకుంఠ ద్వారం వైకుంఠ ఏకాదశి రోజున తెరిచి భక్తులను అనుమతిస్తారు. తరువాత వైకుంఠ ద్వారం మూసివేస్తారు. హిందూ సంప్రదాయానికి విరుద్ధంగా వ్యవహరిస్తుండటంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ మనోభావాలు దెబ్బతినకుండా దేవదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె సిటీ: వారాహి నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ లలితత్రిపుర సుందరి అమ్మవారికి అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ ఉదయం పంచామృతాభిషేకం, వారాహి అష్టోత్తరం, లలిత సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ఆలయంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వైవీయూ బీఈడీ, ఎంఈడీ పరీక్షల తనిఖీ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో జరుగుతున్న బీఈడీ, ఎంఈడీ 2, 4 సెమిస్టర్ పరీక్షలను వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. కడపలోని ఎస్వీ బీఈడీ కళాశాల, రాయచోటి రోడ్డులోని భారత్ బీఈడీ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలను ఆయన పరిశీలించారు. కేంద్ర అబ్జర్వర్లు పరీక్షలను కేంద్రంలో ఉండి పర్యవేక్షించగా, విశ్వవిద్యాలయ హైపవర్ కమిటీ బృందాలు అన్ని కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలోని 15 కేంద్రాల్లో 3,143 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎస్. ఈశ్వర్ రెడ్డి తెలిపారు.

బెంగళూరు రైల్వేలైన్ పనులు చేపట్టాలి

రాయచోటి అర్బన్ : వెనుకబడిన రాయలసీమప్రాంత సమగ్రాభివృద్ధికి ఎంతగానో దోహదపడే కడప - బెంగళూరు రైల్వేలైన్ నిర్మాణం పనులను వెంటనే చేపట్టాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ మాజీ సభ్యుడు వై.విశ్వనాథ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప- బెంగళూరు రైల్వే మార్గాన్ని 2008-09లో అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి మంజూరు చేయించారన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఎంతో అవసరమన్న ఉద్దేశ్యంతో 50 శాతం నిధులు కేంద్రప్రభుత్వం, మరో 50శాతం నిధులు రాష్ట్రప్రభుత్వం భరించే షరతులతో ఈ ప్రాజెక్టు మంజూరైందన్నారు. సీఎం చంద్రబాబు ఈ రైల్వేలైన్ పూర్తిపై దృష్టి పెట్టి రాష్ట్ర వాటా నిధులను మంజూరు చేయడం ద్వారా పనులను ప్రారంభించాలన్నారు.

హుండీ ద్వారా రెడ్డెమ్మకొండకు ఆదాయం



రెడ్డెమ్మతల్లి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో హుండీ ద్వారా రూ.7,03,377ఆదాయం వచ్చింది. శనివారం స్థానిక ఆలయంలో రాయచోటి దేవదాయశాఖ అధికారి రవికిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మూడునెలల కాలానికి సంబంధించి అమ్మవారి ఆలయానికి వివిధ కానుకల ద్వారా 40.78 గ్రాముల బంగారు, 600.830 గ్రాముల వెండి వచ్చింది. నగదు రూపంలో రూ. 7,03,377ఆదాయం వచ్చినట్లు రెడ్డెమ్మకొండ ఈఓ మంజుల తెలిపారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమచేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది బాలకృష్ణ, వెంకటరమణ, మహేష్, అర్చకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో ఆదివారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామివారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చివరగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

విత్తనకాయల పరీక్ష నమూనా ప్రదర్శన



వేరుశనగ విత్తన కాయల నాణ్యత పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

గుర్రంకొండ: మండలంలోని ఎల్లుట్ల, సంగసముద్రం , గుర్రంకొండ ఆర్బీకేల్లో వేరుశనగ విత్తన కాయల పరీక్ష నమూనాను ప్రదర్శించారు. ఖరీఫ్‌సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేయడానికి ముందుగా విత్తనకాయల పరీక్షను వ్యవసాయశాఖ సిబ్బంది నిర్వహిస్తుంటారు. శనివారం ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో ఇటివల రైతులకు పంపిణీ చేసిన టీజీసీఎస్, నారాయణి, కే6 రకం విత్తనకాయల మొలకెత్తిన నమూనాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా వ్యవసాయశాఖ సిబ్బంది, అధికారులు రైతులకు వీటిపై అవగాహన కల్పించారు. ఒకట్రేలో మట్టి ఇసుకను ఎరువులతో నింపి మూడు రకాల విత్తనకాయల్ని వేర్వేరు ట్రేలలో 100 విత్తన గింజల్ని విత్తినట్లు రైతులకు వారు పేర్కొన్నారు. 12 రోజుల అనంతరం మొలకెత్తే శాతం మేరకు నాణ్యత పరీక్ష తెలుస్తుందన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 80 నుంచి 90 శాతం వరకు మొలకెత్తితేనే నాణ్యమైన విత్తనాలుగా నిర్ధారించవచ్చు. ప్రస్తుతం నిర్వహించిన పరీక్షల్లో 90 శాతం మేరకు విత్తనాలు మొలకెత్తినట్లు వారు పేర్కొన్నారు. ఇలా చేయడం వలన రైతులు తాము కొనుగోలు చేసిన వేరుశనగ విత్తనకాయల్లో మొలకెత్తే శాతం తెలిసిపోతుందన్నారు. ఎంపీఈఓ రిజ్వానా, వీహెచ్ఏ సమీనా, వీఏవో నవాజ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ దేవత వార్షికోత్సవం



అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని మద్దిరేవుల గ్రామం, వంకగడ్డరాచపల్లి సమీపంలో వెలసిన మారెమ్మ దేవత అమ్మవారి 6వ వార్షికోత్సవం శనివారం ఘనంగా ముగిసింది. కుర్నూతల అగ్రహారానికి చెందిన అర్చకులు వెంకటనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అమ్మవారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దిరేవుల ఓబుల్ సుబ్బారెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, శంకర్ రెడ్డి, శివమాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సంజీవరెడ్డి, అశోక్ రెడ్డి, దిలీప్ రెడ్డి, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూమిలో అక్రమ లేఅవుట్లు



అక్రమ లేఅవుట్‌లను వేసిన భూమిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ లక్ష్మీనరసయ్య

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ గ్రామం పరిధిలోని బొగ్గిడివారిపల్లెలో సర్వేనెంబర్ 86/1బి, 1సి వ్యవసాయ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లేఅవుట్‌లను ఏర్పాటు చేశారని ఇన్ చార్జి ఈఓపీఆర్‌డి లక్ష్మీనరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూమిలో సుమారు 4 ఎకరాల 50 సెంట్లలో అక్రమ లేఅవుట్‌లను వేశారని ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. అక్రమ లే అవుట్‌లను వేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఆర్డీఓ నుంచి భూమిని కమర్షియల్‌గా మార్చుకొని, గ్రామ పంచాయతీ అప్రూవల్ అనుమతులు తీసుకొని ప్లాట్లు గాని, రహదారులు గాని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ తప్పనిసరి



పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ ఇస్తున్న వీఎల్ఓ డాక్టర్ జయప్రకాష్

వీరబల్లి : పెంపుడు కుక్కలు కరిచినప్పుడు వాటి వల్ల మనుషులకు వైరస్ సోకకుండా ఉండేందుకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని వీఎల్ఓ డాక్టర్ జయప్రకాష్ అన్నారు. శనివారం అంతర్జాతీయ జూనోసెస్ డే సందర్భంగా మండలంలోని మట్లి పంచాయతీలోని పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెంపుడు జంతువుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే మనుషుల ప్రాణాలకు ముప్పు తప్పదని హెచ్చరించారు. పెంపుడు కుక్కలకు ప్రతి ఆరు మాసాలకు ఒకసారి తప్పనిసరిగా టీకాలు వేయించాలని వారు తెలిపారు. శనివారం మట్లి గ్రామ పంచాయతీలోని మట్లి ఎల్లంపల్లిలో, చందన వ్యాలీలోని పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ ఇచ్చారు.

రాజంపేట రూరల్: పశువులు, జంతువుల నుంచి దాదాపు 280 రకాల వ్యాధులు మానవులకు సంక్రమిస్తాయని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ వై.విజయబాస్కర్‌రావు అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ఉచిత రేబిస్ వ్యాధి నిరోధ టీకాలను శనివారం కుక్కలకు వేశారు. సహాయ సంచాలకులు కె ప్రతాప్, పశువైద్య అధికారి కే భాగ్యావతి, జేవీఓ ఎం వరదయ్య, ఎల్ఎస్ఏలు హరిబాబు, బాషా, వాణి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

సుండుపల్లె : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మండల పశుసంవర్ధకశాఖ తరపున పశువైద్యశాలలో శనివారం ఉచిత రేబిస్ వ్యాధి టీకాలు వేశారు. జంతువులకు వచ్చే వ్యాధుల నిరోధానికి ఈ టీకా ఉపయోగపడుతుందని ఏడీ విజయకుమార్ తెలిపారు. కాంపౌండర్ రమణ, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

సిద్దవటం : కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని సిద్దవటం పశుసంవర్ధక శాఖ అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీదేవి అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని పశువుల ఆసుపత్రిలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలను వేశారు. భాకరాపేట పశు వైద్యాధికారి డాక్టర్ శివశంకర్, మాచుపల్లె వైద్యాధికారి డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



స్టెప్ అధికారులకు మెమొంటోను అందజేస్తున్న ఎస్ఈబీ అధికారులు

రాయచోటి టౌన్ : నేటి తరం యువత మత్తుకు బానిసగా మారి జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఎస్ఈబీ వి.శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రాయచోటి పాలిటెక్నికల్ కళాశాలలో 'మాదకద్రవ్యాలు-దుర్వినియోగం' అనే అంశాలపై స్టెప్ అధికారులు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు - సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసగా మారితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. అందుకే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం స్టెప్ అధికారులకు మెమొంటోను అందజేశారు. ఎస్‌సీబీ సీఐ హిమబిందు, స్టెప్ మేనేజర్ వివి సుబ్బరాయుడు, పాలిటెక్నికల్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎన్. ఇందిరా ప్రియదర్శిని, స్టెప్ సూపర్‌వైజర్ వి.వెంకట నారాయణ, ఈసీఈ విభాగాధిపతి చెన్నకేశవ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన



మామిడి మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు

కలికిరి : రైతులకు నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించి మంచి దిగుబడులు సాధించేలా కృషి చేయాల్సిన బాధ్యత కేవీకే శాస్త్రవేత్తలపై ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా. బి. ప్రమీల రాణి, డా. బి.ముకుందరావు అన్నారు. కలికిరి కేవీకేను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రదర్శనా క్షేత్రాలలోని వేరుశనగ విత్తనోత్పత్తి, సమగ్ర కోళ్లు, గొర్రెల పెంపకం, వర్మీ కంపోస్టు, మామిడి మొక్కలు, అజోల్లా పెంపకం తదితరాలను తనిఖీ చేసిన వారు కేవీకే శాస్త్రవేత్తలకు సూచనలు, సలహాలిచ్చారు. కేవీకే ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శనలు విరివిగా నిర్వహించడంతో పాటు, కేవీకేలో ఈగ బుట్టలు, మామిడి ఫ్రూట్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో కేవీకే కో-ఆర్డినేటర్ డా. పాండురంగ, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన టమాటా దిగుబడి

- తగ్గుముఖం పడుతున్న ధరలు
- మార్కెట్‌కు భారీగా తెస్తున్న టమాటాలు

తేదీ	దిగుబడులు (క్వింటాళ్లు)	మొదటి గ్రేడ్ (కిలో ధర)
6-7-24	1439	రూ.52
5-7-24	1468	రూ.50
4-7-24	1434	రూ.44
3-7-24	1411	రూ.50
2-7-24	1403	రూ.46
1-7-24	1424	రూ.48



మార్కెట్ తీసుకువచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ: మదనపల్లె మార్కెట్‌కు రోజు రోజుకు టమాటాలు అధికంగా వస్తున్నాయి. దిగుబడులు పెరగడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. మదనపల్లెతో పాటు పరిసర ప్రాంతాల నుంచి రైతులు వాహనాల్లో టమాటాలు మార్కెట్‌కు తెస్తున్నారు. దీంతో స్థానిక చౌడేశ్వరి సర్కిల్ నుంచి మార్కెట్ వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. ధరలు పెరుగుతుడటంతో రైతులు టమటా పంటపై మొగ్గు చూపారు. ధరలు పుంజుకుంటున్న సమయంలో దిగుబడులు కూడా పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. టమటా కిలో రూ.92 వరకు పలికింది. తరువాత ధరలు రోజు రోజులు తగ్గిపోయాయి. ధరలు తగ్గుముఖం పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.